సాక్షి ప్రకాశం

శుక్రవారం । 21 । జూన్ । 2024



కరువు పరిస్థితులు కేంద్రానికి నివేదిస్తాం

గత ఏడాది రబీలో కరువు పరిస్థితులు పరిశీలించేందుకు వచ్చిన కేంద్ర బృందం జిల్లాలో పర్యటించింది. - 8లో..



బ్యూటీ పార్లర్‌లో అగ్నిప్రమాదం

ఒంగోలు నగరంలోని సాయిబాబా గుడి సమీపంలో ఉన్న బ్యూటీ పార్లర్‌లో అగ్నిప్రమాదం సంభవించింది. - 8లో..

గరిష్టం/కనిష్టం

39.2/28.5

వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. ఒకటి రెండు చోట్ల ఉరుములు, మెరుపులతో జల్లులు పడవచ్చు.

న్యూస్‌రీల్

24 నుంచి ఐటీఐలలో ప్రవేశాలకు కౌన్సెలింగ్

ఒంగోలు: జిల్లాలోని వివిధ ప్రభుత్వ/ప్రైవేటు ఐటీఐలలో 2024–25 సంవత్సరం ప్రవేశాలకు కౌన్సెలింగ్ ఈనెల 24, 25 తేదీల్లో ప్రభుత్వ బాలుర ఐటీఐలో నిర్వహిస్తారని జిల్లా కన్వీనర్ యం.వి.నాగేశ్వరరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పదో తరగతి మార్కుల జాబితా, కులం, టీసీ, ఆధార్‌కార్డు వంటి ఒరిజినల్ ధ్రువపత్రాలతో దిగువ తెలిపిన జీపీఏ/మార్కుల ఆధారంగా దరఖాస్తు చేసిన అభ్యర్థులు హాజరుకావాలన్నారు. 24న ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు 1–254 ర్యాంకు, మధ్యాహ్నం 2 నుంచి 5 గంటల వరకు 255 నుంచి 517, ఈనెల 25 నుంచి 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు 518 నుంచి 815 వరకు, మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు చివరి ర్యాంకు వరకు కౌన్సిలింగ్ జరుగుతుందని పూర్తి వివరాలకు సెల్ నంబర్ 94922 77552 ను సంప్రదించాలన్నారు.

పాఠశాలల్లో అంతర్జాతీయ యోగ దినోత్సవం

ఒంగోలు: జిల్లాలోని అన్ని పాఠశాలల్లో శుక్రవారం అంతర్జాతీయ యోగ దినోత్సవం నిర్వహించాలని జిల్లా విద్యాశాఖ అధికారి డి.సుభద్ర ఆదేశించారు. యోగ ఫర్ సెల్ఫ్ అండ్ సొసైటీ ప్రధాన అంశంగా 10వ అంతర్జాతీయ యోగ దినోత్సవం నిర్వహించి ఫొటోలు, వీడియోలను గూగుల్ డ్రైవ్ లింక్‌ను ఉపయోగించి అప్‌లోడ్ చేయాలని పాఠశాలల హెడ్మాస్టర్లను ఆదేశించారు. యోగ వల్ల కలిగే పలు ప్రయోజనాల గురించి వివరించారు. జిల్లాలోని ఉప విద్యాశాఖ అధికారులు, మండల విద్యాశాఖ అధికారులు వారి పరిధిలోని పాఠశాలల ప్రధానోపాధ్యాయులు తగు సూచనలు జారీచేసి అన్ని పాఠశాలల్లో ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు.

11న ఏకపాత్రాభినయ పోటీలు

ఒంగోలు మెట్రో: జిల్లా రంగభూమి కళాకారుల సంఘం ఆధ్వర్యంలో ప్రతినెలా రెండో శనివారం జరుగుతున్న సాంస్కృతిక కార్యక్రమాల ఏడో వార్షికోత్సవం సందర్భంగా జులై 11వ తేదీ ఉదయం తొమ్మిది గంటల నుంచి ఏకపాత్రాభినయ పోటీలు నిర్వహించనున్నారు. ఒంగోలు ఎన్టీఆర్ కళాక్షేత్రంలో నిర్వహించే ఈ కార్యక్రమానికి సంబంధించి కరపత్రాన్ని గురువారం ఆవిష్కరించారు. సాంఘిక, పౌరాణిక, చారిత్రాత్మక, జానపద, దేశభక్తి, విభాగాల్లో ఏకపాత్రాభినయ పోటీలు జరుగుతాయని, ఆసక్తి కలిగిన కళాకారులు పాల్గొనవచ్చన్నారు. పూర్తి వివరాలకు సెల్: 9963201398, 9848135643 నంబర్లకు సంప్రదించాలని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో కామేపల్లి శ్రీనివాసరావు, రంగభూమి కళాకారుల సంఘం ప్రధాన కార్యదర్శి అంగలకుర్తి ప్రసాద్, కోశాధికారి ధేనువుకొండ సుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

హక్కుల సాధనకు సమష్టిగా పోరాడుదాం

- లక్ష్మీదాస్ వర్ధంతి సభలో నాయకుల పిలుపు

ఒంగోలు టౌన్: ఉద్యోగులు, విశ్రాంత ఉద్యోగుల హక్కుల సాధన కోసం సమష్టి పోరాటాలు చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు కాలం సుబ్బారావు పిలుపునిచ్చారు. గురువారం నగరంలోని ఆర్‌అండ్‌బీ వర్క్ చార్జ్‌డ్ ఉద్యోగులు, విశ్రాంత ఉద్యోగుల సంఘం కార్యాలయంలో ఉద్యోగుల సంఘం నాయకులు లక్ష్మీదాస్ 39వ వర్ధంతి నిర్వహించారు. సంఘం నాయకులు కె.రామ్మోహనరావు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యోగుల హక్కుల సాధన కోసం లక్ష్మీ దాస్ అనేక పోరాటాలు నిర్వహించారని వివరించారు. ఉద్యోగులు, విశ్రాంత ఉద్యోగులకు రావాల్సిన బకాయిలను సాధించుకునేందుకు కృషి చేద్దామన్నారు. కార్యక్రమంలో జి.శ్రీనివాసరావు, అంకిరెడ్డి, వీరరాఘవస్వామి, ఎస్ శ్రీనివాసరావు, సత్యనారాయణ రాజు, వెంకటేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

టంగుటూరు కేంద్రంలో నిలిచిన పొగాకు వేలం

టంగుటూరు: టంగుటూరు పొగాకు వేలం కేంద్రంలో గురువారం వేలం ప్రక్రియ నిలిచిపోయింది. టంగుటూరు పొగాకు బోర్డు 24లో బోర్డు అధికారులు ముఠా కూలీల బిల్లులు చెల్లించక వేలం ఆగిపోయింది. రెండు నెలల నుంచి ముఠా కూలీలకు కూలి డబ్బులు చెల్లించలేదని ట్రాలీ కూలీ పని వారు పనికి రాకుండా మానేశారు. దీంతో ఎక్కడి పొగాకు బేళ్లు అక్కడే నిలిచిపోయాయి. ఇప్పటికైనా కూలి డబ్బులు ఇవ్వాలని కూలీలు కోరుకుంటున్నారు. రైతులు వేలం ఎప్పుడు జరుగుతుందని ఎదురుచూపులు చూస్తూ అయోమయంలో ఉన్నారు. వేలం నిర్వహణాధికారి శ్రీనివాసరావుని వివరణ కోరగా కొత్తగా వచ్చిన ముఠా మేస్త్రీకి లేబర్ కమిషన్ నుంచి సర్టిఫికెట్ ఆలస్యం కావడం వలన బిల్లు ఆగిపోయిందని, ముఠా మేస్త్రీకి బ్యాంకు చెక్కు అందించామని, కూలీలకు డబ్బులు అందుతాయని, శుక్రవారం వేలం ప్రక్రియ యధావిధిగా కొనసాగుతుందని తెలిపారు.

నల్లమలకు బాహుబలి



ఆరున్నర అడుగుల ఎత్తు..12 అడుగుల పొడవు..800 నుంచి 1500 కేజీల భారీ బరువుతో పెద్దపులులను సైతం భయపెట్టే రూపంతో ఉండే వన్యప్రాణి అడవి దున్న.. నల్లమలలో అంతరించిపోయిన ఈ బాహుబలిని మళ్లీ అభయారణ్యానికి తీసుకొచ్చేందుకు అటవీ శాఖ సన్నాహాలు చేస్తోంది. అరణ్యప్రాంతంలో విపరీతంగా పెరిగిపోయిన వెదురుచెట్లతో జీవవైవిధ్యానికి ఏర్పడుతున్న ముప్పును తప్పించేందుకు ఆ వెదురునే ఇష్టంగా తినే అడవి దున్నలను ఇక్కడకు రప్పిస్తున్నారు.

- నల్లమలకు రానున్న అడవి దున్నలు
- అడవుల్లో విపరీతంగా పెరుగుతున్న వెదురు
- దీంతో క్రమేపీ తగ్గుముఖం పడుతున్న జీవవైవిధ్యం
- 20 అడవి దున్నలను రప్పించేలా అధికారుల చర్యలు
- దున్నలు జీవించేందుకు నల్లమల అడవులు అనుకూలం
- పెద్దపులిని సైతం మట్టి కరిపించే తెంపరితనం వీటి సొంతం

పెద్దదోర్నాల:

తూర్పు కనుమల్లో భాగమైన నల్లమల అటవీ ప్రాంతం అతిపెద్ద జీవవైవిధ్యం కలిగిన సుందర సీమగా ఉభయ తెలుగు రాష్ట్రాల్లో భాసిల్లుతోంది. ప్రకృతి సోయగాలకు నిలయమైన నల్లమలలో మానవాళికి ఎంతగానో ఉపయోగపడే వృక్ష సంపద, ఔషధ మొక్కలే కాకుండా పర్యావరణ సమతుల్యతను కాపాడే అరుదైన విశిష్టత కలిగిన ఎన్నో రకాల జీవ జాతులు పెరుగుతున్నాయి. అయితే ఇటీవల కాలంలో నల్లమలలోని కొన్ని ప్రాంతాల్లో విచ్చల విడిగా వెదురు పెరగటం వల్ల జీవవైవిధ్య సమతుల్యతకు భంగం కలుగుతుందన్న అభిప్రాయం శాస్త్రవేత్తల్లో వ్యక్తమైంది. ఈ నేపథ్యంలో లేత వెదురును ఇష్టమైన ఆహారంగా తీసుకునే అరుదైన అడవి దున్నలను నల్లమల అభయారణ్యంలో వదిలి పెట్టాలని అధికారులు నిర్ణయం తీసుకోవటంతో తదనుగుణంగా ఏర్పాట్లను సిద్ధం చేస్తున్నారు.

అడవి దున్నల మనుగడకు నల్లమల అనుకూలం

నల్లమల అభయారణ్యంలో కొన్ని సంవత్సరాల క్రితం వరకు అడవి దున్నలు సంచరించేవి. అయితే కాల క్రమేణా అవి అంతరించిపోయాయి. ఈ నేపథ్యంలో తిరిగి వాటిని కొత్తగా ఇక్కడికి తీసుకు రావాలన్న లక్ష్యంతో అధికారులు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. దీని కోసం డెహ్రాడూన్‌లోని వైల్డ్ లైఫ్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇండియా అధికారులను సంప్రదించటంతో అక్కడి శాస్త్రవేత్తలు నెల రోజుల పాటు నల్లమలలోని పలు ప్రాంతాలను సందర్శించి అడవి దున్నల మనుగడకు నల్లమల వాతావరణం అనువుగా ఉందన్న అభిప్రాయాలను వ్యక్తం చేశారు. దీంతో పాటు అడవి దున్నలు ఎక్కువగా సంచరించే పాపికొండలు నేషనల్ పార్కును సైతం సందర్శించి వాటి జీవన విధానం, మనుగడ, వాతావరణ పరిస్థితులను అధ్యయనం చేసి వారి అభిప్రాయాలను వైల్డ్ లైఫ్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇండియాకు నివేదికల రూపంలో అందజేశారు. ఈ నేపథ్యంలో మరో మూడు నెలల్లో అడవి దున్నలు నల్లమల అడవులకు రానున్నాయి. అదే జరిగితే నల్లమల అభయారణ్యంలోనే అతి పెద్ద వన్యప్రాణులు అడవి దున్నలే కానున్నాయి. వీటిని ఇండియన్ గౌర్, బైసన్ అనే పేర్లతో కూడా పిలుస్తుంటారు.



అడవి దున్నలు

వెదురు పెరుగుదలతో క్రమేపీ తగ్గుతున్న జీవవైవిధ్యం..

నల్లమల అభయారణ్యం పరిధిలో జీవ వైవిధ్యం క్రమేపీ తగ్గుముఖం పడుతుందని శాస్త్రవేత్తలు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. అడవిలోని పలు ప్రాంతాల్లో కేవలం వెదురుకు సంబంధించిన జాతులే అధికంగా పెరగటంతో అది జీవవైవిధ్యాన్ని దెబ్బ తీసేదిగా ఉందని పలువురు భావిస్తున్నారు. అలా కాకుండా దట్టమైన అడవి ప్రాంతంలో మానవాళికి ఉపయోగపడేలా అందమైన పుష్పజాతులు, ఎన్నో రకాల ఔషధ మొక్కలు, మరెన్నో రకాల వృక్షజాతులు సైతం పెరగాలని శాస్త్రవేత్తలు ఆకాంక్షిస్తున్నారు. ఈ నేపథ్యంలో అడవి దున్నల ప్రాముఖ్యతను గుర్తించిన అధికారులు వాటిని నల్లమలకు తరలించనున్నారు. భారీ పరిమాణంతో 800 కేజీల నుంచి 1500 కేజీల వరకు బరువు ఉండే భారీ శరీరం గల అడవి దున్నలు సుమారు ఆరున్నర అడుగుల ఎత్తు, 12 అడుగుల పొడవుతో ఉంటాయి. వీటి కొమ్ములు అర్ధ చంద్రాకారంలో ఉండి ఎంత పెద్ద జంతువునైనా ఎత్తి పడేయగలిగేలా ఉంటాయి. ఎంతో బలిష్టంగా ఉండే ఇవి ఎక్కువగా లేత వెదురును, ఆకులను, పచ్చగడ్డిని ఎక్కువగా తింటుంటాయి. దీంతో పాటు అటవీ ప్రాంతంలో సంచరించే పెద్దపులులు కూడా వీటిని ఎదిరించలేవు. ఈ నేపథ్యంలో 10 ఆడ, మరో 10 మగ అడవి దున్నలను తరలించే పనిలో అధికారులు నిమగ్నమయ్యారు. మగ, ఆడ దున్నల వల్ల సంతానోత్పత్తి ప్రక్రియ కూడా ఆటంకం లేకుండా కొనసాగుతుందన్న అభిప్రాయం అటవీశాఖాధికారుల్లో వ్యక్తమవుతోంది.

> **మరో మూడు నెలల్లో నల్లమలకు అడవి దున్నలు**
>
> 
>
> విపరీతంగా వెదురు పెరుగుతుండటంతో ప్రకృతిలోని జీవవైవిధ్యానికి ప్రమాదం ఏర్పడింది. ఈ నేపథ్యంలో అడవి దున్నలను పాపికొండలు నేషనల్ పార్క్ నుంచి నల్లమలకు తరలించనున్నాం. దీని వల్ల జీవవైవిధ్యానికి ఏర్పడిన ముప్పు తొలగటంతో పాటు, నూతనంగా నల్లమలకు మరో కొత్తరకం వన్యప్రాణులను పరిచయం చేయబోతున్నాం.
>
> – విశ్వేశ్వరరావు, రేంజి అధికారి, పెద్దదోర్నాల.

కరువు నుంచి జిల్లాను ఆదుకోవాలి

- కేంద్ర బృందాన్ని కోరిన మంత్రి డోలా
- బృందానికి కరువు పరిస్థితులను పవర్ పాయింట్ ప్రెజెంటేషన్‌తో వివరించిన కలెక్టర్



కేంద్ర బృందంతో జిల్లా కరువు పరిస్థితులపై సమావేశం నిర్వహిస్తున్న మంత్రి, కలెక్టర్, జేసీ

ఒంగోలు అర్బన్: జిల్లాలో ఉన్న కరువు పరిస్థితుల దృష్ట్యా జిల్లాను ఆదుకోవాలని ఆర్థిక సహాయం అందించేందుకు, నష్టపోయిన రైతులకు పరిహారం అందించేందుకు కృషి చేయాలని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా బాలవీరాంజనేయ స్వామి కేంద్ర బృందాన్ని కోరారు. ప్రకాశం భవనంలో గురువారం జిల్లాలో కరువు పరిస్థితులను అంచనా వేసేందుకు వచ్చిన కేంద్ర బృంద సభ్యులు మన్ను జి ఉపాధ్యాయ్, ఎస్‌సీ కశ్యప్, మదన్ మోహన్ మౌర్య, బీ అనురాధ, కలెక్టర్ ఏఎస్ దినేష్ కుమార్, జాయింట్ కలెక్టర్ గోపాలకృష్ణ మంత్రితో కలిసి సమావేశమయ్యారు. దీంతో మంత్రి మాట్లాడుతూ వెనుకబడిన జిల్లాల్లో ప్రకాశం జిల్లా ఒకటని, జిల్లాలో వాతావరణ పరిస్థితులు దాదాపుగా రాయలసీమ జిల్లాలను పోలి ఉంటుందన్నారు. వర్షాధారంగా పంటలు సాగు చేస్తారన్నారు. ప్రస్తుత కరువు పరిస్థితుల్లో క్షేత్ర స్థాయిలో పంట నష్టం తీవ్రంగా ఉందని తెలిపారు. ప్రజల తాగునీటికి కూడా ట్యాంకర్ల ద్వారా ట్యాంకర్ల ద్వారా సరఫరా చేసే పరిస్థితులు ఉన్నాయన్నారు.

కలెక్టర్ దినేష్ కుమార్ జిల్లాలో నెలకొన్న కరువు పరిస్థితులను శాఖల వారీగా పవర్‌పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా కేంద్ర బృందానికి వివరించారు. జిల్లాలో మొత్తం 38 మండలాల్లో 31 మండలాలను కరువు మండలాలుగా గుర్తించామన్నారు. వాటిలో 20 మండలాలు తీవ్రమైన కరువుగా, 11 మండలాలను జాతీయ విపత్తుల సమస్త మోస్తారు కరువు మండలాలుగా ప్రకటించారన్నారు. మొత్తం 31 మండలాల్లో సాధారణ వర్షపాతం కంటే తక్కువ వర్షపాతం నమోదు కావడంతో 50 శాతానికి పైగా పంట నష్టం వాటిల్లిందన్నారు. మొత్తం మండలాల్లో 36,147 మంది రైతులకు చెందిన 29,713.64 హెక్టార్లలో వరి, శనగలు, వేరుశనగ, మినుములు, చిరుధాన్యాలు పంటలు దెబ్బతిని రైతులు నష్టపోయారని తెలిపారు. ఎన్‌డీఆర్‌ఎఫ్ నిబంధనల ప్రకారం రూ.25.54 కోట్లు, ఎస్‌డీఆర్‌ఎఫ్ నిబంధనల మేరకు రూ.29.40 కోట్లు ఇన్‌పుట్ సబ్సిడీ అంచనాలను రూపొందించినట్లు తెలిపారు. జిల్లాలోని 31 కరువు మండలాల్లో వ్యవసాయం, రూరల్ వాటర్ సప్లయి, పశుసంవర్ధక శాఖలకు సంబంధించి రైతులను ఆదుకునేందుకు రూ.6201.8 లక్షల మేరకు నిధులు అవసరమని కేంద్ర బృందానికి వివరించారు. సమావేశానికి ముందు వ్యవసాయం, ఇరిగేషన్, ఆర్‌డబ్ల్యూఎస్, పశుసంవర్ధక శాఖ, జిల్లా నీటి యాజమాన్యం సంస్థ శాఖలకు సంబంధించి కరువు పరిస్థితులను వివరించే ఫొటోలతో ఏర్పాటు చేసిన ఫొటో ఎగ్జిబిషన్‌ను మంత్రి, కేంద్ర బృందం సభ్యులు పరిశీలించారు. దీనిలో మార్కాపురం సబ్ కలెక్టర్ రాహుల్ మీన, ఒంగోలు, కనిగిరి ఆర్డీవోలు సుబ్బారెడ్డి, జాన్ ఇర్విన్, వ్యవసాయ శాఖ అధికారి శ్రీనివాస్, సీపీవో వెంకటేశ్వరరావు, జెడ్పీ సీఈఓ మాధురి, పశుసంవర్ధక శాఖ జేడీ బేబిరాణి, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ మర్దన్ అలీ, డ్వామా పీడీ అర్జున్‌రావు, ఉద్యానవన శాఖ అధికారి గోపిచంద్, ఎల్‌డీఎం రమేష్, డీఎంహెచ్‌ఓ సురేష్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులను తీర్చిదిద్దాల్సిన బాధ్యత ఉపాధ్యాయులదే

- కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్

ఒంగోలు: కాలానికి అనుగుణంగా అంతర్జాతీయ సమాజంలో వస్తున్న మార్పులు, ఉద్యోగ అవకాశాలను ఎప్పటికప్పుడు గమనిస్తూ ఆయా అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందని కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్ అన్నారు. జిల్లాలోని ఎంపిక చేసిన 20 పాఠశాలలు, కేజీబీవీలు, ఏపీ మోడల్ స్కూల్స్, ఒకేషనల్ కోర్సులు కలిగిన జూనియర్ లెక్చరర్లకు గురువారం స్థానిక నెక్స్‌జెన్ స్కూలులో కెరీర్ ఎడ్యుకేషన్ ప్రోగ్రాంపై అవగాహన కలిగించారు. మూడు రోజుల పాటు జరిగే ఈ కార్యక్రమాన్ని కలెక్టర్ తొలిరోజు ప్రారంభించిన అనంతరం ఆయన మాట్లాడుతూ విద్యార్థి దశను పూర్తి చేసుకుని ఉత్తమ పౌరులుగా పిల్లలు ఎదగడానికి టీచర్ల మార్గదర్శకత్వం ఎంతో కీలకం అన్నారు. విద్యార్థుల ప్రతిభ, వారి ఆసక్తిని గమనించి వారికి ఉద్యోగ అవకాశాలు లభించే కోర్సుల గురించి కూడా తెలియజేయాల్సిన అవసరం ఉందన్నారు. విద్యార్థుల్లో సృజనాత్మకత అధికంగా ఉంటుందని, విద్యా వ్యవస్థను కూడా ఆ స్థాయికి తీసుకువెళ్లాలన్నారు. ఆస్ట్రేలియాలోని మెల్‌బోర్న్ యూనివర్శిటీ ఆధ్వర్యంలో గ్లోబల్ ఎడ్యుకేషన్ సొల్యూషన్స్ సంస్థ సీఈవో రాక్వెల్ షరాఫ్, సబ్జెక్టు ఎక్స్‌పర్ట్ శారా ఆండర్సన్‌ల సహకారంతో జిల్లాలోని విద్యార్థులకు ఉపయోగపడేలా ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ పేర్కొన్నారు. ఈ శిక్షణలో పాల్గొన్న ఉపాధ్యాయులు జిల్లాలోని ఇతర ఉపాధ్యాయులకు, పాఠశాలలకు స్ఫూర్తిగా నిలవాలని ఆకాంక్షించారు. ప్రొఫెసర్ మంజునాథ్, ప్రాజెక్టు హెడ్ యశ్విని, ప్రాజెక్టు కోఆర్డినేటర్ అనూష, ఎస్‌సీఈఆర్‌టీ నుంచి సుధాలక్ష్మి, ఇంటర్మీడియెట్ బోర్డు ప్రొఫెసర్ డాక్టర్ జీఎస్ఆర్ కృష్ణారావు, అకడమిక్ కౌన్సిలర్ పింకీ మిత్రాలు తమ తమ అనుభవాలను ఉపాధ్యాయులకు వివరించారు. కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి బి.సుభద్ర, డైట్ కాలేజీ ప్రిన్సిపాల్ సామా సుబ్బారావు, ఏఎంవో రమేష్, డైట్ లెక్చరర్ రవీంద్ర ప్రసాద్, ఇతర విద్యాశాఖ అధికారులు, ఎంఈవోలు పాల్గొన్నారు.



శిక్షణలో మాట్లాడుతున్న కలెక్టర్ ఏఎస్ దినేష్ కుమార్

హనుమంత వాహనంపై నారశింహుడు



శేషవాహనం పై నారశింహుడు



రాష్ట్ర స్థాయి బండలాగుడు పోటీలు

- ఉత్సాహంగా రాష్ట్ర స్థాయి బండలాగుడు పోటీలు

సింగరాయకొండ: పాతసింగరాయకొండ వరాహ లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం నరసింహస్వామి హనుమంత వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. బుధవారం రాత్రి నరసింహస్వామి శేష వాహనం పై భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా స్వామివారికి గ్రామోత్సవం నిర్వహించారు. ఆలయాన్ని విద్యుత్ దీపాలతో ప్రత్యేకంగా అలంకరించారు. శుక్రవారం ఉత్సవాల్లో ప్రధానమైన గరుడ వాహనం పై స్వామి వారు భక్తులకు దర్శనమిస్తారని ఆలయ ట్రస్టుబోర్డు కమిటీ చైర్మన్ పాముర్తి మాధవరావు తెలిపారు. గరుడోత్సవం సందర్భంగా సోమరాజుపల్లి గ్రామం వరకు గ్రామోత్సవం నిర్వహిస్తారని ఆలయ కార్యనిర్వాహకురాలు పి కృష్ణవేణి వివరించారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు.

రాష్ట్ర స్థాయి బండలాగుడు పోటీలు:

బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆలయ సమీపంలో గురువారం సాయంత్రం శ్రీ కృష్ణ యాదవ్ యూత్‌ఫోర్స్ ఆధ్వర్యంలో రాష్ట్ర స్థాయి బండలాగుడు పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో మూడు జిల్లాలకు చెందిన 7 జతల ఎడ్లు పాల్గొన్నాయని నిర్వాహకులు తెలిపారు. శుక్రవారం రాష్ట్ర స్థాయి రాధాడు పోటీలు నిర్వహించనున్నట్లు కమిటీ వారు వివరించారు.

పనిమానుకుంటారా.. సామాన్లు బయటపడేయాలా?

- మధ్యాహ్న భోజన పథకం కార్మికులపై అధికార పార్టీ ఒత్తిడి
- హెడ్మాస్టర్ల ద్వారా ఒత్తిడి చేస్తున్నారని యూనియన్ నేతల ఆరోపణ
- బడుగు బలహీన వర్గాలకు చెందిన కార్మికులపై జులుం తగదంటున్న నాయకులు

ఒంగోలు టౌన్: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే మధ్యాహ్న భోజన పథకం కార్మికులను పని మానేయాలని, లేకపోతే సామాన్లను బయట పడేస్తామంటూ భయాందోళనలకు గురిచేస్తున్నారని ఏపీ మధ్యాహ్న భోజన పథకం కార్మికుల యూనియన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు గురునాథరావు, పి.కల్పన గురువారం ఒక ప్రకటనలో ఆరోపించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ప్రస్తుతం పనిచేస్తున్న మధ్యాహ్న భోజన పథకం కార్మికులను పని మానేయాలంటూ హెడ్మాస్టర్ల ద్వారా ఒత్తిడికి గురి చేస్తున్నారని తెలిపారు. నిజానికి మధ్యాహ్న పథకం కార్మికులు గత 23 సంవత్సరాలుగా ప్రైమరి, అప్పర్ ప్రైమరీ, హైస్కూళ్లలో విద్యార్థినీ విద్యార్థులకు ప్రభుత్వ మెనూ ప్రకారం ఆహారాన్ని వండిపెడుతున్నారని వివరించారు. నిత్యావసర వస్తువుల ధరలు పెరిగిపోతున్న నేపథ్యంలో ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంటూ కూడా విద్యార్థులకు వంట చేసి పెడుతున్న కార్మికులను తొలగించడం భావ్యం కాదన్నారు. మధ్యాహ్న భోజన పథకం కార్మికుల తొలగింపులకు సంబంధించి వేధింపులను ఆపాలని, అధికారులపై రాజకీయ నాయకులు ఒత్తిళ్లకు గురిచేయడం మానుకోవాలని కోరారు. మధ్యాహ్న భోజన పథకం కార్మికుల్లో అత్యధిక శాతం మంది బడుగు, బలహీన వర్గాలకు చెందిన మహిళలే ఉన్నారని, వారిని ఇబ్బంది పెట్టడం తగదని హితవు పలికారు. అనేక సంవత్సరాలుగా ఇబ్బందులకోర్చి పని చేస్తున్న కార్మికులను తొలగించడం సరైన పద్ధతి కాదని అభ్యంతరం వ్యక్తం చేశారు. పాత వారిని కొనసాగించాలని, పెరుగుతున్న ధరలకనుగుణంగా మెనూ రేట్లను కూడా పెంచాలని డిమాండ్ చేశారు.

క్లుప్తంగా

అనారోగ్యంతో పంచాయతీ కార్యదర్శి మృతి



నరేంద్ర భౌతికకాయానికి నివాళులర్పిస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు

తాళ్లూరు(ముండ్లమూరు): మండలంలోని నాగంబొట్లపాలెం పంచాయతీ కార్యదర్శిగా పనిచేస్తున్న పురం నరేంద్ర(42) అనారోగ్యంతో బాధపడుతూ గురువారం మృతి చెందారు. మృతునికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఆయన భౌతికకాయానికి ఎంపీడీఓ కార్యాలయం ఏఓ వజ్జ శ్రీనివాసరావు, సర్పంచ్‌ల సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు మారం ఇంద్రసేనారెడ్డి, సర్పంచ్ చిమటా సుబ్బారావు, నాయకులు గోపిరెడ్డి వెంకటేశ్వర రెడ్డి, సుబ్బారెడ్డి, ఇమ్మానియేలు, ఆంజనేయులు, సిబ్బంది చంద్రశేఖరరావు, రాఘవరెడ్డి, చంద్రశేఖరరెడ్డి, చిరంజీవి, కోటేశ్వరరావు తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

పొగాకు అత్యధిక ధర రూ.340

ఒంగోలు సెంట్రల్: ఒంగోలు రీజియన్ పరిధిలో పొగాకు ధర గురువారం గరిష్టంగా కేజీ రూ.340 పలికిందని టుబాకో బోర్డు ఆర్ఎం లక్ష్మణరావు తెలిపారు. రీజియన్ పరిధిలో వేలం కేంద్రాలకు గురువారం 8,236 బేళ్లు రాగా 8,126 కొనుగోలయ్యాయని, వ్యాపారులు వివిధ కారణాలతో 610 బేళ్లను తిరస్కరించారని వివరించారు. ఫిబ్రవరి 29న మొదలైన ఒంగోలు, కొండపి కేంద్రాల్లో 85వ రోజు వేలం సాగుతోందని తెలిపారు. మార్చి6న ప్రారంభమైన డీసీ పల్లి, కలిగిరి, కందుకూరు-2, ఒంగోలు-2, వెల్లంపల్లి, పొదిలి, కనిగిరి తదితర కేంద్రాల్లో 80వ రోజు వేలం నిర్వహిస్తున్నట్లు చెప్పారు.

ఏపీ పీజీ సెట్ ర్యాంకర్లకు అభినందన



ర్యాంకర్లతో డాక్టర్ సతీష్, కళాశాల సిబ్బంది

మార్కాపురం: ఏపీ పీజీ సెట్‌లో ర్యాంకులు సాధించిన విద్యార్థులను జార్జి విద్యా సంస్థల సెక్రటరీ డాక్టర్ ఆదిమూలపు సతీష్ గురువారం కళాశాలలో నిర్వహించిన కార్యక్రమంలో అభినందించారు. ఏపీ పీజీ సెట్ ఫలితాల్లో జార్జి ఫార్మసి కళాశాలకు చెందిన జొన్నలగడ్డ సతీష్ 88వ ర్యాంకు, పి. చందన 245వ ర్యాంకు సాధించారు. అలాగే వెయ్యిలోపు ర్యాంకులను 35 మంది విద్యార్థులు సాధించినట్లు అకడమిక్ అడ్వయిజర్ డాక్టర్ స్టెల్లా సతీష్ తెలిపారు. కళాశాలకు మంచి పేరు తీసుకొచ్చారని డాక్టర్ సతీష్ సంతోషం వ్యక్తం చేశారు.

108లో ప్రసవం



108లో ప్రసవించిన అల్లూరుకు చెందిన భవానీ

ఒంగోలు టౌన్: పురిటి నొప్పులతో బాధపడుతున్న ఒక మహిళ 108లో ప్రసవించింది. వివరాల్లోకి వెళితే..కొత్తపట్నం మండంలోని అల్లూరు గ్రామానికి చెందిన చర్మచర్ల భవానీ గురువారం పురిటి నొప్పులతో బాధపడుతుండగా కుటుంబసభ్యులు 108కు ఫోన్ చేశారు. సమాచారం అందుకున్న వెంటనే స్పందించిన 108 సిబ్బంది హుటాహుటిన అల్లూరు చేరుకున్నారు. గర్భిణిని అంబులెన్స్‌లో ఎక్కించుకొని తిరిగి బయలుదేరారు. మార్గమధ్యలో పురిటి నొప్పులు ఎక్కువయ్యాయి. దీంతో ఈఎంటీ పుల్లయ్య, సచివాలయం ఏఎన్ఎం సుభాషిణి, ఆశ కార్యకర్త భూలక్ష్మిలు సదరు గర్భిణికి కాన్పు చేయగా భవాని పండంటి బిడ్డకు జన్మనిచ్చింది. కొత్తపట్నం ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించగా డాక్టర్ వైష్ణవి వైద్య పరీక్షలు చేసి తల్లిబిడ్డలు సురక్షితంగా ఉన్నట్లు తెలిపారు.

మహిళా శిశుసంక్షేమ శాఖకు యువతి అప్పగింత

- 2012 నుంచి అనాథైన బాలికను చదివించిన ఒంగోలు ప్రభుత్వ బాల సదన్


ఒంగోలు సెంట్రల్: జిల్లా బాలల సంక్షేమ కమిటీ ఆదేశాల మేరకు ఒంగోలు ప్రభుత్వ బాల సదనంలో ఆశ్రయం పొందుతున్న ఎం దేవిక అనే యువతిని గురువారం ఆ శాఖ చైర్‌పర్సన్ రామాంజనేయులు, కమిటీ సభ్యులు, మహిళాభివృద్ధి, స్త్రీ శిశు సంక్షేమ శాఖ కార్యాలయ నోడల్ అధికారి సులోచనకు అప్పగించారు. 2012లో దేవిక తల్లిదండ్రులు మృతి చెందడంతో అమ్మమ్మ సంరక్షణలో ఉంటూ ఒంగోలు బాల సదన్‌లో జిల్లా బాలల సంక్షేమ కమిటీ ఆశ్రయం కల్పించారు. బాల సదన్‌లో ఒకటి నుంచి ఐదు తరగతులు, తర్వాత ఆరు నుంచి పదో తరగతి వరకు చినగంజాం కేజీబీవీ పాఠశాలలో పూర్తి చేసింది. కాలేజ్ ఎట్ హోమ్ గుంటూరులో ఇంటర్మీడియెట్ పూర్తి చేసిన అనంతరం తిరిగి బాలసదనంలో ఆశ్రయం కల్పించారు. అయితే ఈ నెల 14 తేదీకి ఆమెకు మైనర్ వయసు తీరి 18 ఏళ్లు వచ్చి మేజర్ కావడంతో తదుపరి జిల్లా మహిళావృద్ధి స్త్రీ సంక్షేమశాఖ అధికారికి అప్పగించారు. స్వధార్ హోమ్ లేదా స్టేట్ హోమ్‌లో ఆశ్రయం కల్పించాలని కోరారు. జిల్లా పర్యవేక్షణ అధికారి బాల ప్రభాకర్, బాల సదన్ పర్యవేక్షకుడు డి.జీవిత, సంరక్షణ అధికారి కె.శేఖర్‌బాబు, బాలల సంక్షేమ కమిటీ సభ్యులు టి.శివశంకర్, సుమానశ్రీ పాల్గొన్నారు.

దివ్య యోగం

'చక్కటి ఆరోగ్యవంతమైన అలవాట్లను కలిగి ఉండడంతో పాటు నియమబద్ధంగా చేసే వ్యాయామం, యోగాసనాల వల్ల మనసు, శరీరం, ప్రాణ శక్తి మరింత ఉత్తేజితమవుతాయి. రక్త ప్రసరణతో పాటు నాడీ వ్యవస్థ పనితీరు మెరుగుపడుతుంది. శరీరం త్వరగా వార్థక్యం బారిన పడకుండా కాపాడుతుంది. ప్రాణ శక్తిని ఉద్దీపనం చేయడం ద్వారా ఆయుష్షు పెరుగుతుంది. ఉచ్వాసనిశ్వాసలు, ఉద్వేగాలను క్రమబద్ధీకరించడం, ఆలోచనలను నియంత్రించడం, మనసును ఒకే విషయంలో నిమగ్నం చేయడం, సూర్య నమస్కారాలు, యోగసనాలు, ధ్యానం, ప్రాణామాయం ప్రక్రియల ద్వారా శారీరక, మానసిక ఆరోగ్యం లభిస్తుంది. చేసే పనిలో శ్రద్ధ, ఏకాగ్రత పెరుగుతాయి' నేడు ప్రపంప యోగా దినోత్సవం సందర్భంగా 'సాక్షి' ప్రత్యేక కథనం..



ఉపయోగాలు అనేకం



- మొత్తం శరీర భాగం ముందుకు, వెనుకకు వంచడం వల్ల అంతరేంద్రియాలకు, వెన్నెముకకు రక్త ప్రసారం బాగా జరిగి అవి శక్తి వంతంగా, పటిష్టంగా తయారవుతుంది.
- స్థూలకాయం తగ్గుతుంది. నేత్ర, హృదయ వ్యాధులు దూరమవుతాయి.
- చర్మం, స్వేద గ్రంధులకు రక్త ప్రసారం జరగడం వల్ల అవి యాక్టివ్ అవుతాయి.
- చర్మ వ్యాధులు నివారించబడతాయి. చర్మం కాంతి వంతమవుతుంది.
- మూత్ర సంబంధిత వ్యాధులను నివారించవచ్చు.
- ఆహారం తీసుకోవడం, జీర్ణం చేసుకోవడం, విసర్జించడం లాంటి క్రియలు మెరుగై కణజాలానికి మంచి పోషణ కలుగుతుంది.
- వయసు మీద పడుతున్నా ముసలితనపు ఛాయలు కనిపించవు. శరీరానికి మనసుకు ఒక లయ ఏర్పడి ఏకాగ్రత, జ్ఞాపక శక్తి పెరుగుతుంది.

- యోగాతో పరిపూర్ణ ఆరోగ్యం
- మానసిక ఒత్తిడి, శారీరక రుగ్మతలు దూరం
- నేడు ప్రపంచ యోగా దినోత్సవం

ఒంగోలు సెంట్రల్:

ప్రకృతి ఒడిలో ఉదయిస్తున్న సూర్యడికి ఎదురుగా నిల్చుని, ఆ కిరణాల ప్రసారాన్ని శరీరం ఆస్వాదిస్తుండగా సూర్య నమస్కారాలు చేయడం వల్ల ఎన్నో లాభాలున్నాయనేది పెద్దల మాట. శరీరాన్ని ఆసనాల రీతిలో కదల్చడం వల్ల వాటిని యోగాసనాలుగా పిలుస్తాం. సమస్త జీవులకు ప్రాణ దాత అయిన సూర్య భగవానుడిని దైవంగా భావించి నమస్కరిస్తూ కొన్ని మంత్రాలు, బీజాక్షరాల్ని జపించినప్పుడు అది పూజలా, శరీర కదలికలు వేగంగా, నిదానంగా ఉండటం వల్ల చూపరులకు అది వ్యాయామంలా అనిపిస్తుంది. ఎలా భావించినా క్రమం తప్పకుండా సూర్య నమస్కారాలు, యోగా చేయడం వల్ల బోలెడన్ని లాభాలున్నాయి.

సూర్య నమస్కారాలు, యోగా సాధన ఇలా..

ప్రణామాసనం, హస్త ఉత్థాసనం, పాద హస్తాసనం, అశ్వ సంచలనాసనం, పర్యాతాసనం, అష్టాంగ (సాష్టాంగ) నమస్కారాసనం, భుజంగాసనం (సర్పాసనం) వీటి తర్వాత పర్వత, ఆశ్వసంచలన, పాద మస్త, హస్త ఉత్థ ప్రణామాసనాల్ని చేయాలి. ఈ 12 ఆసనాలతో ఒక ఆవృతం పూర్తవుతుంది. స్త్రీ, పురుషులెవరైనా తమ మానసిక, శారీరక స్థితిగతులను అనుసరించి క్రమంగా ఒకటి నుంచి ఆరంభించి 24 రౌండ్ల వరకు సూర్య నమస్కారాలు చేయవచ్చు. అయితే సాధన ప్రారంభించిన వెంటనే కొన్ని రోజులకే ఎక్కువ సార్లు చేయాలనే ఆరాటం మాత్రం ఉండకూడదు. క్రమక్రమంగా కొద్ది నెలల కాలంలో ఎక్కువ రౌండ్లు చేయాలే తప్ప తమ శక్తిని మించి చేయకూడదు. ఈ మధ్య కాలంలో యోగా, సూర్య నమస్కారాలపై యువత, ప్రజలు అవగాహన పెంపొందించుకుంటున్నారు. మారుమూల గ్రామాల్లో సైతం యోగా ప్రత్యేక శిక్షణ శిబిరాలు ఏర్పాటు చేస్తున్నారు.

యోగాతో ఆరోగ్యం, క్రమశిక్షణ



యోగా చేయడం వల్ల ఆరోగ్యంతోపాటు క్రమశిక్షణ పెరుగుతుంది. దశాబ్దాల కాలంలో అనేక పట్టణాలతోపాటు గ్రామాల్లో సైతం యోగా శిక్షణ ఇస్తూ ప్రజల్లో ఆరోగ్యంపై అవగాహన పెంపొందిస్తున్నాం. దీర్ఘకాలిక వ్యాధులబారిన పడిన వారు ఆరోగ్యంగా ఉంటున్నారు. సాత్విక ఆహారంపైనా ప్రజలకు అవగాహన కల్పిస్తున్నాం. మనిషిలో ఎప్పుడైతే క్రమశిక్షణ ఉంటుందో ఆరోగ్యం, అభివృద్ధి దానంతట అవే వస్తాయి.

– శ్రీరామ్ గురూజీ,
యోగ, ధ్యాన్య నిపుణుడు



కరువు పరిస్థితులు కేంద్రానికి నివేదిస్తాం

- మార్కాపురంలో కేంద్ర బృందం పర్యటన

మార్కాపురంరూరల్: గత ఏడాది రబీలో ఏర్పడిన కరువు పరిస్థితులను పరిశీలించేందుకు ఢిల్లీ నుంచి వచ్చిన కేంద్రం బృందం గురువారం మార్కాపురం ప్రాంతంలో పర్యటించింది. ఈ బృందంలో ఎంఅండ్ఎ డైరెక్టర్ మున్నుజీ ఉపాధ్యాయ, కేంద్ర పశు సంవర్ధక శాఖ డిప్యూటీ డైరెక్టర్ ఎస్ఈ కశ్యప్, ఢిల్లీకి చెందిన ఫుడ్ అండ్ పబ్లిక్ డిపార్టుమెంట్ డిప్యూటీ డైరెక్టర్ మదన్‌మోహన్ మౌర్య, నీతీ ఆయోగ్ సీనియర్ రీసెర్చ్ ఆఫీసర్ అదూరాధ బట్నాతో పాటు జిల్లా, స్థానిక అధికారులు పాల్గొన్నారు. తొలుత వేములకోట చెరువును పరిశీలించి స్థానిక రైతులతో మాట్లాడారు. రబీలో ఏర్పడిన కరువు పరిస్థితులు, పంటల దిగుబడి, పెట్టుబడి వ్యయం, ఉపాధి హామీ పనులు, రైతులకు, కూలీలకు ప్రభుత్వం నుంచి అందుతున్న సాయాన్ని తెలుసుకున్నారు. అనంతరం వారు కోలభీమునిపాడు గ్రామాన్ని సందర్శించారు. కరువు పరిస్థితులపై కేంద్రానికి నివేదిక ఇస్తామని తెలిపారు. కేంద్రం బృందం ఎదుట వేములకోట దళిత మహిళలు తమ ఆవేదన వ్యక్తం చేశారు. ఉపాధి హామీ పథకంలో అంతా అవినీతేనని, పనులు చేసినా బిల్లులు చెల్లించకుండా జాప్యం చేస్తున్నారని కేంద్ర బృందం దృష్టికి తీసుకువచ్చారు. వేములకోట చెరువుకు నలువైపులా రాతికట్టడం నిర్మించాలని, చెరువులో ఉన్న చిల్లకంపను తొలగించాలని, చెరువులో మట్టితవ్వకాలు ఆపాలని కోరారు. చెరువులో నీరు ఉన్న సమయంలో చుట్టుపక్కల రైతులంతా వరి పండించే వారని, కొన్నేళ్ల నుంచి చెరువుకు నీరు రాకపోవడంతో రైతులు పొలాలు అమ్ముకునే పరిస్థితి నెలకొందని వాపోయారు. కోలభీమునిపాడులో గతంలో రైతులు సాగు చేసి నష్టపోయిన పంట పొలాలను పరిశీలించారు. రైతు భరోసా కేంద్రం వద్ద ఏర్పాటు చేసిన ఫొటోస్టాల్‌ను పరిశీలించారు. అనంతరం రైతులతో మాట్లాడారు. ఈ సందర్భంగా రైతులు తమ బాధలను ఏకరవు పెట్టారు. పశుగ్రాసం అధిక ధరలు పలుకుతుండటంతో కొనుగోలు చేయలేక, పశువులకు నీరు అందించలేక అమ్ముకోవాల్సిన పరిస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ప్రాంతంలో ఫ్లోరైడ్ నీరు అధికంగా ఉంటడంతో పంటల ఎదుగుదల లేక దిగుబడులు సక్రమకంగా లేవని తెలిపారు. ఫ్లోరైడ్ నీరు డ్రిప్ పైపుల ద్వారా పంటలకు పెట్టడం వల్ల డ్రిప్ పైపులు రెండేళ్ల కంటే ఎక్కువ కాలం పనిచేయడం లేదన్నారు. వ్యవసాయం, పాడిపరిశ్రమలపై ఆధారపడి జీవించే వారికి ప్రభుత్వం రాయితీ కల్పించారని రైతులు కేంద్ర బృందానికి విన్నవించారు. ఈ సందర్భంగా కేంద్రం బృంద సభ్యులు మాట్లాడుతూ మీ సమస్యలను కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. వీరి వెంట మార్కాపురం సబ్‌కలెక్టర్ రాహుల్ మీనా, జిల్లా వ్యవసాయాధికారి ఎస్ శ్రీనివాసరావు, ఆర్‌డబ్ల్యూఎస్ సూపరింటెండెంట్ ఇంజినీర్ ఎస్‌కె మర్దాన్‌అలీ, ఇరిగేషన్ సూపరింటెండెంట్ సి.నాగమురళీమోహన్, డీఆర్‌డిఏ పీడీ అర్జున్‌రావు, జిల్లా పశువైద్యాధికారి డాక్టర్ కే బేబీ రాణి, మార్కాపురం తహసీల్దార్ రవికుమార్, ఎంపీడీఓ తోట చందన, ఏడీఏ బాలాజీనాయక్, ఏఓ శ్రీనివాసరెడ్డి, ఇరిగేషన్ డీఈ పోల్‌రాజు, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ జ్యోతి స్రజన, సీఐ వెంకటేశ్వర్లు, ఎస్సై వెంకటేశ్వరనాయక్, ఏపీఓ జీవరత్నం, ఏపీఎం రమేష్ పాల్గొన్నారు.



వేములకోటలో పర్యటిస్తున్న కరువుబృందం సభ్యులు



కోలభీమునిపాడులో గ్రామస్తులతో మాట్లాడుతున్న కరువు బృందం సభ్యులు

ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో చోరీ

- 17 గ్రాముల బంగారు ఆభరణాలు, రూ.45 వేల నగదు చోరీ

పామూరు: స్థానిక ఆర్టీసీ బస్టాండ్ సమీపంలోని నివాస గృహంలో చోరీ జరిగింది. వివరాల్లోకి వెళితే.. పామూరుకు చెందిన పసుపులేటి రవికుమార్ అనే వ్యక్తి స్థానిక బస్టాండ్ సమీపంలో నివాసముంటున్నారు. ఇటీవల రవికుమార్ భార్య కాన్పు నిమిత్తం పామూరులోని పుట్టింటికి వెళ్లింది. రవికుమార్ మామ నారాయణస్వామికి ఆరోగ్యం సరిగా లేకపోవడంతో వారం రోజుల పాటు గుంటూరులో వైద్యం కోసం వెళ్లి అక్కడే ఉన్నారు. గురువారం ఉదయం 10:30 సమయంలో రవికుమార్ ఇంటికి రాగా ఇంటి తలుపు తాళాలు పగులగొట్టి ఉన్నాయి. ఇంట్లోకి వెళ్లి చూడగా బీరువా తాళాలు పగులగొట్టడంతో పాటు అందులోని వస్తువులు, దుస్తులు చెల్లాచెదురుగా పడిఉన్నాయి. బీరువాలో ఉన్న రూ.45 వేల నగదు, 17 గ్రాముల బంగారు చైను, పట్టుచీరలు చోరీకి గురైనట్లు గుర్తించారు. వెంటనే సీఐ రామానాయక్‌కు సమాచారం ఇచ్చారు. ఒంగోలు నుంచి వచ్చిన క్లూస్‌టీం ఘటనా స్థలంలో ఆధారాలు సేకరించారు. గతంలో 2022లో కూడా చోరీ జరిగిందని బాధితుడు వాపోయాడు.



ఆధారాలు సేకరిస్తున్న ఒంగోలు క్లూస్‌టీం సభ్యులు

మార్కాపురాన్ని కరువు ప్రాంతంగా ప్రకటించాలి

- కేంద్ర బృందానికి ఏపీ రైతు సంఘం వినతి

మార్కాపురం టౌన్: మార్కాపురం ఏరియాని కరువు ప్రాంతంగా ప్రకటించాలని కేంద్ర బృందానికి ఏపీ రైతు సంఘం, వ్యవసాయ కార్మిక సంఘాల నాయకులు విజ్ఞప్తి చేశారు. గురువారం కరువును పరిశీలించేందుకు వచ్చిన కేంద్ర బృందానికి డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని అందించారు. అడుగంటిపోయిన నీటి మట్టాన్ని పెంచే విధంగా చెక్ డ్యామ్ నిర్మాణం చేపట్టాలని, అన్నీ చెరువులకు మరమ్మతులు చేయాలని కోరారు. బ్యాంకుల వద్ద రైతులు తీసుకున్న రుణాలను రద్దు చేయాలని, ఈ ఏడాది వడ్డీలేని బ్యాంకు రుణాలను అందించాలని, రుణ పరిమితిని రూ.2 లక్షలకు పెంచాలని కోరారు. వెంటనే కరువు సహాయక చర్యలు చేపట్టాలని, ఉపాధి కార్మికులకు 200 రోజుల పనిదినాలతోపాటు 600 రూపాయల కూలీ ఇవ్వాలని కోరారు. కౌలు రైతులకు గుర్తింపు కార్డులు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో సంఘ నాయకులు గుమ్మా బాలనాగయ్య, ఏరువ పాపిరెడ్డి, తిరుపతయ్య, ఓర్సు అడివయ్య, ఏడుకొండలు, జనుమాల నాగయ్య పాల్గొన్నారు.



వినతిపత్రం ఇస్తున్న రైతు సంఘం నాయకులు

కరువు నివారణ చర్యలు చేపట్టాలి

- కేంద్ర బృందానికి రైతు సంఘాల విజ్ఞప్తి

ఒంగోలు టౌన్: జిల్లాలో తరచుగా కరువు పరిస్థితులు ఏర్పడుతుండటంతో రైతాంగం అనేక విధాలుగా నష్టాలకు గురవుతోందని, శాశ్వత కరువు నివారణ చర్యలు చేపట్టి ఆదుకోవాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం, కౌలు రైతు సంఘం కేంద్ర బృందానికి విజ్ఞప్తి చేశాయి. గురువారం కరువు పరిశీలనకు వచ్చిన కేంద్ర బృందాన్ని ఆయా సంఘాల కమిటీ సభ్యులు కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రైతు సంఘాల జిల్లా కార్యదర్శులు పమిడి వెంకటరావు, వి.బాలకోటయ్య మీడియాతో మాట్లాడుతూ.. గత ఖరీఫ్, రబీ సీజన్లలో పశ్చిమ ప్రాంతంలోని 30 శాతం పంటలు ఎండిపోయాయని తెలిపారు. పశువులు తాగడానికి కూడా నీరు లేని దుస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు. వెలుగొండ ప్రాజెక్టు మిగిలిన పనులు పూర్తి చేస్తే పశ్చిమ ప్రాంతం కరువు బారిన పడకుండా ఉంటుందన్నారు. కౌలు రైతులను గుర్తించి నేరుగా వారికే నష్టపరిహారం అందజేయాలని డిమాండ్ చేశారు. రైతులు, కౌలు రైతుల పంటరుణాలను రద్దు చేయాలని కోరారు. కేంద్ర బృందాన్ని కలిసిన వారిలో రైతు సంఘం నాయకులు జయంతి బాబు, హనుమంతు తదితరులున్నారు.



కేంద్ర బృందానికి వినతి పత్రం సమర్పిస్తున్న రైతు సంఘాల నాయకులు

బ్యూటీ పార్లర్‌లో అగ్ని ప్రమాదం



బ్యూటీ పార్లర్‌లో మంటలు ఆర్పుతున్న అగ్నిమాపక సిబ్బంది

- రూ.4 లక్షల విలువైన పరికరాలు దగ్ధం

ఒంగోలు టౌన్: నగరంలోని సాయిబాబా గుడి సమీపంలో పాత ఎంప్లాయిమెంట్ కార్యాలయం వద్ద గల ప్రొఫెషనల్ హెయిర్ అండ్ బ్యూటీ సెలూన్‌లో గురువారం అగ్ని ప్రమాదం సంభవించింది. నిర్వాహకురాలు విన్నకోట దుర్గా భవాని గురువారం ఉదయం 9 గంటల సమయంలో సెలూన్ తెరిచేందుకు వచ్చారు. అప్పటికే సెలూన్ నుంచి పొగలు వస్తున్నాయి. షట్టర్ తెరవగానే పెద్ద ఎత్తున మంటలు ఎగిసిపడ్డాయి. ఇరుగు పొరుగు సహాయంతో మంటలను ఆర్పేందుకు ప్రయత్నించినప్పటికీ ఫలితం లేకపోవడంతో అగ్నిమాపక దళానికి ఫోన్ చేశారు. హుటాహుటిన సంఘటనా స్థలానికి చేరుకున్న ఏడీఎఫ్ఓ వి. శ్రీనివాసులురెడ్డి, అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపుచేశారు. ప్రమాదంలో సుమారు రూ.4 లక్షల విలువైన పరికరాలు కాలి బూడిదయ్యాయి. విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా ప్రమాదం సంభవించినట్లు భావిస్తున్నారు. అగ్ని ప్రమాదం జరిగిన ఈ మూడంతస్తుల భవనంలో కెనరా బ్యాంకు, పక్కనే ఏటీఎం ఉన్నాయి. అగ్నిమాపక సిబ్బంది సకాలంలో చేరుకుని మంటలు ఆర్పకపోతే మరింత నష్టం జరిగి ఉండేదని స్థానికులు చెబుతున్నారు.

సుజాతా నగర్‌లో మరో ప్రమాదం

ఒంగోలులోని సుజాత నగర్‌లో గురువారం మధ్యాహ్నం అగ్ని ప్రమాదం చోటుచేసుకుంది. సుజాత నగర్‌లోని 7వ లైనులో ఇళ్ల స్థలాల మధ్య ఉన్న ఖాళీ స్థలంలో స్థానికులు చెత్తా చెదారం వేస్తున్నారు. ప్రమాదవశాత్తు అక్కడ ఉన్న చెత్త తగలబడటంతో పెద్ద ఎత్తున మంటలు చెలరేగాయి. దట్టంగా పొగలు వ్యాపించడంతో పరిసరాల్లోని ప్రజలు ఇబ్బంది పడ్డారు. అగ్నిమాపక సిబ్బంది మంటలు అదుపుచేయడంతో స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు.

పాఠశాలల్లో ప్రమాణాల పెంపునకు కృషి

- డీఈవో సుభద్ర

ఒంగోలు: పాఠశాలల్లో తొలి నుంచే అన్ని రకాల ప్రమాణాల పెంపుకు కృషి చేయాలని హెడ్మాస్టర్లకు డీఈఓ బి.సుభద్ర సూచించారు. స్థానిక స్పందన సమావేశ మందిరంలో ఒంగోలు డివిజన్ పరిధిలోని హెడ్మాస్టర్లు, ఉప విద్యాశాఖ అధికారులు, ఏఎస్ఓలతో గురువారం ఆమె సమీక్షించారు. ఈ సందర్భంగా ఆమె కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్ సందేశాన్ని ఆడియో ద్వారా హెడ్మాస్టర్లకు వినిపించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ విద్యార్థుల డ్రాపౌట్ అనేది లేకుండా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఇందుకోసం జూలై 12వ తేదీని టార్గెట్‌గా ప్రకటించారు. యుడైస్ ప్లస్ అప్‌లోడ్ చేయడం, నేను బడికి పోతా ప్రచార కార్యక్రమాన్ని ముమ్మరం చేయాలన్నారు. విద్యార్థి కిట్ల పంపిణీ, ఈ హాజరు గురించి పలు సూచనలు చేశారు. పాఠశాల అకడమిక్ క్యాలెండర్ త్వరలో విడుదలవుతుందని, అది రాగానే హెడ్మాస్టర్లు తమతమ పాఠశాలల్లో టైమ్ టేబుల్ రూపొందించుకోవాలన్నారు. స్టాఫ్ మీటింగ్‌లు, తల్లిదండ్రుల కమిటీ మీటింగ్‌లతో పాటు ఐఎఫ్‌పీ పానల్స్, ట్యాబ్స్ సక్రమంగా వినియోగించుకునేలా చూడాలన్నారు. గత ఏడాది పదోన్నతి పొందిన ఉపాధ్యాయులకు కూడా త్వరలోనే ట్యాబ్‌లు అందజేస్తామన్నారు. నాడు నేడు పనుల రికార్డుల నిర్వహణలో హెడ్మాస్టర్లు అప్రమత్తంగా ఉండాలని సూచనలు చేశారు. ఇక మధ్యాహ్న భోజనం రుచిగా ఉండేలా చర్యలు చేపట్టాలన్నారు. అనంతరం ఈ నెలాఖరులో రిటైర్ కాబోతున్న, జనవరి నుంచి మే నెల వరకు రిటైర్డు అయిన హెడ్మాస్టర్లను ఒంగోలు ఉప విద్యాశాఖ అధికారి అనిత రోజ్ రాణి సమక్షంలో డీఈఓ సుభద్ర, హెడ్మాస్టర్లు సత్కరించారు.



మాట్లాడుతున్న డీఈఓ సుభద్ర



హాజరైన హెడ్మాస్టర్లు